## క్లుప్తంగా

### వధూవరులకు ఆశీర్వాదం

**వెదురుకుప్పం:** మండలంలోని జీటీకండ్రిగ సమీపంలోని పీఆర్పీ కన్వెన్షన్ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం జరిగిన సీనియర్ జర్నలిస్టు రఘునాథరెడ్డి కుమారుడు సాయిచందురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి కుమార్తె ధరణి పెళ్లి వేడుకలకు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వధూవరులను ఆశీర్వదించారు. సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి హాజరై ఆశీర్వదించారు.

### చలివేంద్రం ప్రారంభం

**నింద్ర:** మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు త్రీవంగా ఉండడంతో చలివేంద్రం ప్రారంభించామన్నారు. స్వచ్ఛ భారత్ ద్వారా ప్రతి పంచాయతీఓ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గృహ నిర్మాణాల పరిశీలన

**నింద్ర:** మండలంలో గృహనిర్మాణ పనులను హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామని తెలిపారు. పనులు పూర్తి కాని వారితో మాట్లాడి పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

**నగరి:** బస్టాండు సమీపంలో నిర్మిస్తున్న మునీశ్వర స్వామి ఆలయాన్ని స్థానిక దాతలు నవీకరిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా మునీశ్వర చెట్టు పీఠం, పొంగళ్ల గది, విశ్రాంతి గది, బాత్‌రూం, ప్రహరీ, ఆర్చి పనులు పూర్తయ్యాయి. ఇంకా డైనింగ్ హాలు, గేట్లు తదితర పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు రాష్ట్ర పట్టు సమాఖ్య అభివృద్ధి మాజీ చైర్మన్ రాధాకృష్ణ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించారు. శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ వారికి చెక్కును అందించారు. తదుపరి పనులకు కూడా తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మనోహర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వేసవి దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనుంజయవర్మ

**కార్వేటినగరం:** మండుతున్న ఎండల నుంచి వేసవి తాపాన్ని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేశామని సర్పంచ్ ధనుంజయవర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈఓపీఆర్డీ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి

**పాలసముద్రం:** పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు తీసుకొస్తున్న వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని నగరి డివిజన్ డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. శనివారం పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీసులతో డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ మాట్లాడుతూ పాలసముద్రం మండలం తమిళనాడు సరిహద్దుల్లో ఉన్నందున నాటుసారాను అరికట్టాలని తెలిపారు. వెల్‌నెస్ విరాళంగా ఇచ్చిన నాలుగు బారికేడ్లను ప్రారంభించారు. ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప ఉన్నారు.

### మెటీరియల్ పంపిణీ

**కార్వేటినగరం:** స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం నగరి డివిజన్ ఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పలు ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ మెటీరియల్ చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి దోహద పడుతుందని తెలిపారు. అనంతరం యువకులకు పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్వేటినగరం సీఎం హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### అభివృద్ధికి అడ్డు

**గంగాధరనెల్లూరు:** కాలువ నిర్మాణంపై పంతం పట్టిన కూటమి నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. శనివారం గ్రామ సర్పంచ్ పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ భారతి, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. కాలువ నిర్మాణం చేపట్టి మురుగు నీరు, వర్షపు నీరు గ్రామం వెలుపల వదలడానికి తీర్మానం చేశారు. సమస్య పరిష్కారం అయిందని సంతోషపడేలోపు కాలువ నిర్మాణానికి తహశీల్దార్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కచ్చితంగా కావాలంటూ పంచాయతీ కార్యదర్శి పెట్టిన మెలికతో సభ్యులు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో సర్పంచ్ అధికారాలను సైతం కాలరాస్తున్న ఈ కూటమి ప్రభుత్వ నేతలకు ప్రజలే త్వరగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# కుర్రోళ్ల గంజాయ్..!

**గంజాయి మాదకద్రవ్యాన్ని వినియోగిస్తున్న వారిలో మైనర్లు ఎక్కువగా ఉంటున్నారన్నది ఆందోళన కలిగిస్తున్న విషయం. చాపకింద నీరులా డ్రగ్స్ ఇప్పుడు పల్లెలకు, సామాన్యుల ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. గురువారం ఇద్దరు మైనర్లు నగరి మండలం వెంగన్నకండ్రిగ వద్ద గంజాయి తరలిస్తూ పట్టుబడిన సంఘటన నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో 19 నుంచి 21 వయస్సున్న ముగ్గురు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. 19 ఏళ్ల వయస్సులో తరలింపు వరకు వచ్చారంటే వీరు మైనర్లుగా ఉన్న సమయం నుంచే గంజాయికి బానిసైనట్లు తెలుస్తోంది. దీనిపై మున్సిపల్, మండల సమావేశాల్లో అధికారులు చర్చించే పరిస్థితి వచ్చింది. వీటి నుంచి బయటపడాలంటే తొలుత జాగ్రత్త పడాల్సింది తల్లిదండ్రులే అని విశ్లేషకులు చెబుతున్నారు. –నగరి**



గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ యువకులు (ఫైల్)

- చాపకింద నీరులా వ్యాపిస్తున్న గంజాయి వాడకం
- మైనర్లపై అధిక ప్రభావం
- తల్లిదండ్రులూ.. జాగ్రత్త పడండి

తల్లిదండ్రులు పిల్లల్ని నమ్మడం మంచిదే కానీ పరిస్థితులని నమ్మలేం కాబట్టి అప్రమత్తంగా ఉండడం అవసరం. ఎందుకంటే మాదకద్రవ్యాల అలవాటు చాపకింద నీరులా మన ఇళ్లలోకి వచ్చేసే అవకాశం ఉంది. తల్లిదండ్రులు విడిపోవడం, గొడవ పడడం, అతి క్రమశిక్షణ, హాస్టల్లో ఉండడంలాంటివి కొంతవరకు కారణమైతే, అంతా కలిసే ఉంటున్నా తల్లిదండ్రులు తమ ఉద్యోగ వ్యాపారాల్లో బిజీగా ఉండి పిల్లల్ని పట్టించుకోకపోవడం అన్నిటికన్నా పెద్ద కారణమవుతోందని నిపుణులు చెబుతున్నారు. కుటుంబసభ్యులంతా కలిసి సమయం గడపడం బాగా తగ్గిపోయిందనీ దాంతో పిల్లల ప్రవర్తనలో మార్పుల్ని గమనించ లేకపోతున్నారనీ, మరోపక్క అవసరానికి మించి స్వేచ్ఛా డబ్బూ అందుబాటులో ఉండడం వారిని తప్పుదారి పట్టేలా చేస్తోందని కొందరు విశ్లేషకులు అంటున్నారు.

**దొంగతనాలకు కారణం**

గంజాయికి అలవాటు పడ్డాక, డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడడం మొదలు పెడుతున్నారు. ఇటీవల నగరి పట్టణంలో చైన్‌స్నాచింగ్ చేసి పట్టుబడ్డ వారు కూడా దురలవాట్లతోనే చోరీకి పాల్పడుతున్నట్లు చెప్పడం దీనిని రుజువు చేస్తోంది. గంజాయి తేలిగ్గా దొరకడం సమాజం కల్పిస్తున్న వెసులుబాటు. దీంతో వీటికి అలవాటుపడిన వారు తేలిగ్గా తమ స్నేహితులనూ దించుతున్నారు. సాధారణంగానే పిల్లల మీద స్నేహితుల ప్రభావం ఎక్కువ. డ్రగ్స్ తీసుకుంటే గొప్ప ఆలోచనలు వస్తాయనీ, ఏకాగ్రతతో బాగా చదువుకోవచ్చనీ చెప్పి ఆశపెడతారు. అమాయకులైన పిల్లలు అవన్నీ అబద్ధాలని తెలియక నమ్మేస్తారు. మైనర్లకు అలవాటు చేయడం తేలిక కాబట్టే వ్యాపారులు కూడా వారినే టార్గెట్ చేస్తున్నారు. పది పాకెట్లు అమ్మితే ఒకటి ఉచితంగా ఇస్తామని, రూ.100కు కొని రూ.200కు అమ్ముకోవచ్చని పేద పిల్లలకు గాలం వేస్తున్నారు.

**ఇలా కనిపెట్టవచ్చు..**

పిల్లల్లో కనిపించే కొన్ని లక్షణాలను బట్టి వాళ్లు డ్రగ్స్ తీసుకుంటున్నారని కనిపెట్టవచ్చంటున్నారు నిపుణులు. అలవాటుపడ్డవారు చదువు మీదా పనిమీదా దృష్టి పెట్టలేరని, ఒకలాంటి మత్తులో ఉండడం, తిండి సరిగా తినకపోవడం, బరువు తగ్గడం, శుభ్రత పాటించకపోవడం, అతిగా నిద్రపోవడం, చిరాకు పడడం, తమ గదికి ఎవ్వరినీ రానివ్వకపోవడం, మాటలకు చేతలకు సమన్వయం లేకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం వీటి లక్షణాలుగా గుర్తించవచ్చంటున్నారు. వీటిని సునిశితంగ పరిశీలించి వైద్యచికిత్స చేయాలంటున్నారు.

**పిల్లల కదలికపై ప్రత్యేక శ్రద్ధ**



చదువుకుంటున్న పిల్లలు గంజాయికి అలవాటు పడి, నేరాలలో పాల్గొని విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గంజాయి బారిన పడకుండా చూసుకోవాలి. ఎవరైనా వారిని అలవాటుకు ఉసిగొల్పేలా సందేహం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

–విక్రమ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, నగరి

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నగరి:** సబ్‌స్టేషన్ల నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ బాలచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**విజయపురం:** మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సదాశివం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరి 132 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అంతరాయానికి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

### వైభవంగా పొన్నెమ్మ తిరునాళ్లు



విశేషాలంకారంలో పొన్నెమ్మ తల్లి

**గంగాధరనెల్లూరు:** మండల పరిధిలోని బొమ్మవారిపల్లెలో వెలసిన శ్రీపొన్నెమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారి తిరునాళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించి, పుష్ప పల్లకిలో బాణసంచా వేడుకలు బ్యాండ్ బాజాలు కోలాటాల నడుమ పిల్లలు మహిళలు యువకులు నృత్యాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వైఎస్సార్ సీపీ నేతకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**శ్రీరంగరాజపురం:** మండలంలోని కటికపల్లి పంచాయతీ సర్పంచ్ మార్కొండయ్య తండ్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శీనయ్య శనివారం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కటికపల్లి గ్రామానికి వెళ్లి శీనయ్య మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ శీనయ్యను కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన వెంట ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, రాజశేఖర్‌రెడ్డి, మణి, గోవిందస్వామి, ఢిల్లయ్య, కోటిరెడ్డిబాబు, శ్యామ్, అమావాసయ్య, సునీల్, జనార్దన్, యేసయ్య, గోవింద రెడ్డి, యుగంధర్, మణి, ముత్యాలు, బాబు, ప్రసాద్‌రెడ్డి, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన డీసీసీబీ అధికారులు

**గంగాధరనెల్లూరు:** డీసీసీ బ్యాంకు జిల్లా అధికారులు సహకార సంఘం కార్యాలయ ఆవరణంలో శనివారం మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని గంగాధరనెల్లూరు సహకార సంఘం కార్యాలయంలో డీసీఓ నాగవర్ధన, సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకు కంప్యూటరీకరణపై తనిఖీ నిర్వహించారు. అనంతరం బ్యాంకు ఆవరణలో మూడో శనివారం సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణం పచ్చదనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్టర్ కిషోర్, బ్యాంకు మేనేజర్ గోమతి, సహకార సంఘం సీఈఓ విజయ్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ మాధురి, స్టాఫ్ అసిస్టెంట్ మునుస్వామి పాల్గొన్నారు.

### నైపుణ్యం పెంచుకుంటే విజయమే..

**నగరి:** నైపుణ్యం పెంచుకుంటూ ఎంచుకున్న రంగంలో విజయం తథ్యమని పినాకా ట్రస్టు అధినేత ఐఆర్ఎస్ యాదగిరి అన్నారు. పినాకా ప్రజాసాధికార ట్రస్టు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధి, పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు ఎలా నైపుణ్యాన్ని పెంచుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై 21 రోజులపాటు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. జూన్ 6వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఎంఈఓ నమశ్శివాయం, కోర్సు డైరెక్టర్ మునస్వామి, ఫ్యాకల్టీ రవిశంకర్, మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

## డిజిటల్ పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ



రైతులకు శిక్షణ అందిస్తున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి

**పెనుమూరు (కార్వేటినగరం):** పెనుమూరు మండలం ఆర్‌సీ పల్లి రైతుసేవాకేంద్రం పరిధిలోని రైతులకు శనివారం స్కిల్ ఆఫ్ చిత్తూరు కార్యక్రమంలో భాగంగా డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించారు. జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులకు వాతావరణం, మార్కెట్ ధరలు, డిజిటల్ చెల్లింపులపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ యాప్‌ల ద్వారా రైతులు తాము పండించిన పంటలకు మార్కెట్‌లో విక్రయించుకోవచ్చునన్నారు. వివిధ మార్కెట్లలో ధరలను మొబైల్‌లోని వ్యవసాయ యాప్‌లో లేదా అగ్రి సెంట్రల్ యాప్ ద్వారా గానీ తెలుసుకోవాలన్నారు. దీంతో దళారీ వ్యవస్థ మీద ఆధారపడకుండా రైతు లాభాలను పొందవచ్చన్నారు. పంటలకు తెగులు సోకినా ఆ ఫొటోను అప్‌లోడ్ చేయడం ద్వారా వాటికీ ఏ మందులు పిచికారీ చేయాలన్న వివరాలను కూడా వ్యవసాయం యాప్, ప్లానిక్స్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. యూట్యూబ్ వినియోగం, రైతుల వాట్సాప్ గ్రూపుల నిర్వహణపై తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ సంధ్య, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జి సుప్రియ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## డైయింగ్ యూనిట్ల నిర్వహణపై చర్చ

- మున్సిపల్ కార్యాలయంలో పీసీబీ ఈఈ సమావేశం
- రహస్య సమావేశంపై కౌన్సిల్ ఆగ్రహం

**నగరి:** డైయింగ్‌యూనిట్ల నుంచి వచ్చే హానికర రసాయన నీటి సమస్య పరిష్కరించాలని, డైయింగ్ యూనిట్లను నివాసాలకు దూరంగా తరలించాలని కొన్ని నెలలుగా పోరాటాలు జరుగుతున్న విషయం విదితమే. అలాగే పలు సమావేశాల్లో మున్సిపల్ కౌన్సిల్ ఈ అంశంపై అధికారులను నిలదీస్తోంది. డైయింగ్ యూనిట్లపై ఎందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నిస్తోంది. ఈ దశలో నగరి మున్సిపల్ కార్యాలయానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శుక్రవారం సాయంత్రం వచ్చి మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. అయితే ఈ సమాచారం కొందరు ప్రజాసంఘాల నాయకులకు మాత్రమే అందింది. ఈ సమావేశానికి హాజరైనవారు హానికర రసాయన నీటి సమస్య పరిష్కరించాలంటూ విరుచుకుపడడం, డైయింగ్ ప్లాంట్ల స్లడ్జ్ వివరాలు కోరారు. రాత్రిళ్లు రసాయన నీటిని బయటకు వదిలేస్తున్నారని, అప్పుడు పరిశీలించి చర్యలు తీసుకునేదెవరని ప్రశ్నించినట్లు కూడా తెలిసింది.

**గుట్టుచప్పుడు కాకుండా సమావేశం**

డైయింగ్ యూనిట్లపై పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వస్తే మున్సిపల్ చైర్మన్‌కు గానీ, కౌన్సిలర్లకు గానీ సమాచారం అందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సమావేశానికి వచ్చి ఉంటే హానికర రసాయనాలపై ప్రశ్నించేవారమని, సమస్య పరిష్కారానికి మార్గం లభించేదన్నారు. సమస్యపై తమ పోరాటం ఇంకా ఉధృతం చేస్తామన్నారు.

## వెదురుకుప్పంలో మోస్తరు వర్షం



పాతగుంటలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు

**వెదురుకుప్పం:** మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది. ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. పిడుగుల శబ్దానికి ప్రజలు భయాందోళన చెందారు. పచ్చికాపల్లంలో వర్షపు నీరు రావడంతో రోడ్లు జలమయమైంది. వర్షపు నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో దుకాణాల్లోకి నీరు చేరింది. దుకాణాల ముందు నిల్వ ఉంచిన సరుకులు తడిసిముద్దయ్యాయి. పాతగుంటలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరకడంతో కుంటను తలపించింది. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉడికిపోయారు. సాయంత్రం మేఘావృతమై వర్షం రావడంతో ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

## సారాతో పట్టుబడితే జైలు తప్పదు



పట్టుబడిన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు

**విజయపురం:** నాటు సారా తయారు చేసినా.. విక్రయిస్తూ పట్టుబడినా జైలు శిక్ష తప్పదని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ హెచ్చరించారు. శనివారం మంగళం దళితవాడలో డీఎస్పీ తన బృందంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. పుత్తూరు, నగరి, నాగలాపురం, విజయపురం మండలాలకు చెందిన ఎక్సైజ్, సివిల్, తమిళనాడు పోలీసులు సైతం ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. అనంతరం డ్రోన్ సాయంతో గ్రామాన్ని జల్లెడ పట్టారు. ఈ దాడుల్లో రికార్డులు లేని 6 ద్విచక్ర వాహనాలతో పాటు 10 లీటర్ల సారా ప్యాకెట్లను పట్టుకొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నాటు సారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయిస్తూ పట్టుబడినా ఉపేక్షించేది లేదని, కేసు నమోదు చేసి జైలుకి పంపిస్తామని హెచ్చరించారు. నాటుసారా తయారీలో యూరియాతో పాటు మత్తు కలిగించే పదార్థాలను కలుపుతారని, వాటిని తాగితే మనుషులు చనిపోతారని తెలిపారు. ఎక్కడైనా నాటు సారా తయారీ చేస్తుంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 14405, 94409 02549 నెంబర్లకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో చిత్తూరు ఎక్సైజ్ ఏఈఎస్ క్రిష్ణకిషోర్, ఎన్‌ఫోర్సుమెంట్ ఏఈఎస్ సుబ్రమణ్యం, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



**వడమాలపేట (విజయపురం):** వడమాలపేట మండలం అప్పలాయిగుట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల్ సేవలను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొన్నారు. సాయంత్రం ఉభయనాంచారులతో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించారు. వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామివారి ఊంజల్ సేవ కొనసాగింది. అనంతరం శ్రీపద్మావతి ఆండాల్ సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిని మేళాతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదం అందించారు. ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్రాలో భాగస్వాములు కావాలి



పక్షుల కోసం నీటి కుండల ఏర్పాటు

**పుత్తూరు:** ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ పిలుపునిచ్చారు. మూడో శనివారాన్ని పురస్కరించుకొని మున్సిపల్ ఆధ్వర్యంలో బీట్ ది హీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్‌లో విస్తృతంగా పర్యటించి మాస్ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. మున్సిపల్ పార్కులో పక్షుల కోసం నీటితో మట్టి కుండలను ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక నగరం రోడ్డులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పట్టణ ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతాన్ని పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## మట్టి టిప్పర్లు గ్రామంలోకి రావొద్దు


- ఆందోళన చేపట్టిన సాయినగర్ గ్రామస్తులు



గ్రావెల్ టిప్పర్ల రాకపోకలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న సాయినగర్ ప్రజలు

**పాలసముద్రం:** మండలంలోని తొట్టికండ్రిగ పంచాయతీ సాయినగర్ గ్రామంలోని వీధుల్లో గ్రావెల్ టిప్పర్లు వెళ్లకూడదని గ్రామస్తులు శనివారం నిరసన చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో టిప్పర్లు వెళ్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మట్టి తీసుకెళ్లడానికి వీలుకాదని చెప్పడంతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. సాయినగర్ గ్రామం సమీపంలోని గుట్టల్లో నుంచి గ్రావెల్ తీయడానికి అధికార పార్టీ నాయకులు జేసీబీలతో గ్రామంలోని వీధుల్లో మిట్టపల్లాలను చదును చేస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఆడుకుంటున్నారని, భారీ టిప్పర్లతో ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. గ్రావెల్ టిప్పర్ల కారణంగా ఇళ్లు, వాకిళ్లు మట్టితో నిండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిప్పర్లు వెళ్లడానికి అడ్డుకుంటే విద్యుత్, తాగునీరు కట్ చేస్తామని, గ్రామంలో అభివృద్ధి పనులు చేయమని బెదిరిస్తున్నారని వాపోయారు. ఎన్నికల సమయంలో గ్రామానికి సీసీ రోడ్డు, తాగునీటి ట్యాంకు కట్టిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. అయితే అధికారం చేపట్టి ఏడాది దాటినా సమస్యలు పరిష్కారం చేయలేదని తెలిపారు. గ్రామస్తులు అందరూ కలసి రెవెన్యూ అధికారికి వీధుల్లో టిప్పర్లు వెళ్లకూడదని వినతి పత్రం అందించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


**గతంలో ఐదు మేకలు మృతి**



గతంలో ఇలాగే మా గ్రామంపై టిప్పర్లలో గ్రావెల్ మట్టి తీసుకెళ్లుతున్నపుడు ఐదు మేకలు టిప్పర్ ఢీకొని మృతి చెందాయి. తరచూ టిప్పర్లలో మట్టి తీసుకెళ్తుంటే ఇంట్లో మట్టి దుమ్ము నిండిపోతోంది. మా గ్రామంలోని వీధుల్లో నుంచి టిప్పర్‌లో మట్టి తోలుకుని వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.

–రమీజ, సాయినగర్


**అభివృద్ధి చేయమంటున్నారు**



అధికార పార్టీ నాయకుడు టిప్పర్లలో మట్టి తీసుకెళ్లడానికి రోడ్డు వదలకపోతే గ్రామానికి అభివృద్ధి పనులు చేయమని బెదిరించాడు. తాగునీరు, విద్యుత్ కూడా కట్ చేస్తామని తెలిపారు. తాగునీరు లేకపోతే పక్కనున్న తమిళనాడుకి వెళ్లి తీసుకొచ్చుకుంటాం. మట్టి తీసుకెళ్లడానికి వీలు లేదు.

–జ్ఞానయ్య, సాయినగర్

**ఉన్న రోడ్డుని పాడు చేయొద్దు**



అయ్యా మా గ్రామాన్ని అభివృద్ధి చేయ కపోతే పోయారు. ఉన్న రోడ్డుని పాడు చేయకపోతే చాలు. మీరు గ్రావెల్ తీసుకెళ్లాలంటే వేరే రోడ్డులో తీసుకెళ్లడి. గత రెండు, మూడు నెలలుగా రోజుకి 50 నుంచి 60 టిప్పర్లు గ్రావెల్ తీసుకెళ్తున్నాయి. ఎవ్వరైనా అడిగారా. టిప్పర్లను మా వీధుల్లో వెళ్లనీయం.

–సిద్ధమ్మ, సాయినగర్